క్లుప్తంగా

హెచ్ఐవీ బాధితులను ఆదరించాలి



న్యూట్రిషియన్ కిట్ అందిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్

నగరి: హెచ్ఐవీ బాధితులను దూరంగా ఉంచరాదని స్లెప్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రమీలమ్మ అన్నారు. మంగళవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. బియ్యం, ఐదు కిలోలు కందిపప్పు, శనగ పప్పు, నూనె, వంట సామగ్రి 20 మంది హెచ్ఐవీ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ పాజిటివ్ అయితే ఎలాంటి సేవలు అందించాలి, ఏఆర్టీ మెడిసిన్ ఎలా తీసుకోవాలి అనే అంశాలను వివరించారు. స్లెప్స్ ఎన్జీఓ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు సాయం చేయాలని ప్రతి ఒక్కరు దీని ఆదర్శంగా తీసుకొని సేవ చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్లెప్స్ ప్రివెన్షన్ యూనిట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆరుముగం, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే పొరపాట్లు సరిదిద్దుతాం



అంబోధరపల్లె గ్రామ సభలో తహసీల్దార్ చంద్రశేఖర్

గంగాధరనెల్లూరు: రీ సర్వే కార్యక్రమంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు గంగాధరనెల్లూరు మండలం అంబోధరపల్లె సచివాలయంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో కొంతమంది రైతులకు చెందిన భూముల విస్తీర్ణంలో తేడాలున్నట్లు గుర్తించామన్నారు. దీనివల్ల రైతులకు సమస్యలు ఏర్పడుతున్నాయని పలువురు నివేదించారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి ప్రతి మండలంలో గ్రామసభల ద్వారా రైతులకు రీసర్వేలో జరిగిన పొరబాట్లను సరిదిద్దడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఆర్బీకే అడ్వైజరీ కమిటీ చైర్మన్ బాబురెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, వీఆర్ఓ హరిబాబురెడ్డి, రైతులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



బొజ్జనెత్తం పాఠశాలలో టీవీ

పుత్తూరు: మండల పరిధిలోని బొజ్జనెత్తం ఎంపీపీ స్కూల్ హెచ్ఎంగా పనిచేస్తున్న బి.భారతి మంగళవారం రూ.30 వేలు విలువ చేసే టీవీని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఎంఈఓ తిరుమలరాజు టీవీని అందజేసిన హెచ్ఎంను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ శాంతి, వైస్ చైర్మన్ చెంచులక్ష్మీ, ఉపాధ్యాయులు కేశవులు, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ సుజాతమ్మ మృతి



సుజాతమ్మ

విజయపురం: మాజీ జెడ్పీటీసీ సుజాతమ్మ(74) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతిపై పలువురు రాజకీయ నాయకులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె 2006లో కాంగ్రెస్ తరపున జెడ్పీటీసీగా గెలిచారు. మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ప్రజాసేవలో చురుగ్గా పాల్గొని, అనేక సేవ కార్యక్రమాలు చేశారు. బుధవారం మధ్యాహ్నం ఆమె స్వగ్రామం జంబాడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె సోదరుడు లక్ష్మీపతిరాజు తెలిపారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

గుడిపాల: సీఎస్ఆర్ కళాశాలలో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్ మాట్లాడుతూ మనిషికి స్వేచ్ఛ, సమానత్వమే మానవ హక్కుల ఉద్దేశమన్నారు. కుల,మత వర్గ రహితంగా అందరికీ మానవ హక్కులను మన రాజ్యాంగం ప్రసాదించిందని తెలిపారు. ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి పుట్టుకతోనే కొన్ని హక్కులు లభిస్తాయని తెలిపారు.

▶▶ ఇటీవల వడమాలపేట మండలంలో ఓ ఎస్టీ కాలనీకి చెందిన ఓ గర్భవతి ప్రసవ సమయంలో బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందింది.

▶▶ నెల క్రితం విజయపురం మండలం ఇల్లత్తూరులో ఓ బాల్య వివాహం జరుగుతుంటే ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అడ్డుకొని బాల్య వివాహంపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు

బాల్య వివాహం వద్దు.. బడికెళ్లనివ్వండి



బాల్య వివాహంపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బాల్య వివాహాలు ఆడబిడ్డలకు శాపంగా మారుతున్నాయి. ఆడుతూపాడుతూ ఉండాల్సిన వయస్సులో పెళ్లి పీటలెక్కుతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన బాలికలు పూలదండతో అత్తారింటిలో అడుగుపెడుతున్నారు. పట్టుమని 15 ఏళ్లు కూడానిండకుండానే భార్యగా, తల్లిగా బాధ్యతలు మోస్తున్నారు. పేదరికం ఒక వైపు, ఆడపిల్ల భారం తీరుతుందని కన్నవాళ్లే సంసారసాగరంలోకి బాలికలను నెడుతున్నారు. 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

- బాలికలకు శాపంగా బాల్య వివాహాలు
- బడికి వెళ్లాల్సిన వయసులో కుటుంబ బాధ్యతలు
- 18 ఏళ్లు నిండకుండనే వివాహాలు
- బాలికల సంరక్షణ కోసం టోల్ ఫ్రీ నంబర్ 1098 ఏర్పాటు

విజయపురం: బాల్య వివాహం నేరం. దీని వల్ల చాలా నష్టాలున్నాయి. బాలికలు మానసికంగా, శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందనిన అటు అధికారులు చెబుతున్నా... ఎక్కడో ఒక చోట బాల్యవివాహం జరుగుతూనే ఉంది. అసలు ఆడబిడ్డగా పుట్టడం శాపమా...లేక పాపమా అని ఆడ బిడ్డలు తల్లిదండ్రులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల్లోనే బాల్య వివాహాలు జరుగుతున్నాయి. బాలికల తల్లిదండ్రులకు అక్షరజ్ఞానం, సమాజం పట్ల అవగాహన లేకపోవడం, కుమార్తెకు పెళ్లి చేస్తే భారం తగ్గుతుందనే ఆలోచన, పిల్లలు ప్రేమవైపు ఆకర్షితులైతే కుటుంబం పరువు పోతుందనే భయం, మేనరికాలు, వరుడికి ఉద్యోగం ఉందనే కారణంతో వారి బంగారు భవిష్యత్తుకు మాంగల్య బంధనం వేస్తున్నారు. బడికి వెళ్లే వయస్సులో పూలదండ వేసి అత్తారింటికి సాగనంపుతున్నారు.

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

ఎక్కడైన బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయిలో తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు అడ్డుకునే అధికారం ఉంది. అయితే ఒక్క ఐసీడీఎస్ అధికారులు తప్ప ఇతర శాఖల అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడంతో ఎక్కడో ఒక మూలన బాల్య వివాహం జరుగుతూనే ఉంది.

చిన్న వయసులో గర్భం ప్రమాదం

చిన్న వయసులో గర్భం దాల్చడంతో బాలికలు ఎనీమియా బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. ప్రసవం సమయంలో అధిక రక్త స్రావం, అధిక రక్తపోటుతో మరణాలు సంభవిస్తాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. కాబట్టి బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదం జరిగి అవకాశం ఎక్కువ.

అవగాహన లోపం

తల్లిదండ్రులకు బాల్య వివాహం చట్టంపై అవగాహన లేకపోవడంతో తమ పిల్లలకు చిన్న వయస్సులోనే వివాహం చేసేస్తున్నారు. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష రూ.లక్ష జరిమానా ఉంటుంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు. ఆ పైబడి కూడా వివాహం చేస్తే కఠిన చర్యలు ఉంటాయి.

సమాచారం ఇవ్వండి



ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. పోలీసు, రెవెన్యూ, చిల్డ్రన్ 1098 ద్వారా వాటిని అడ్డుకుంటాం. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను వివరిస్తున్నాం. బాలికల ఆరోగ్యం, వారి భవిష్యత్తుపై తెలియజేస్తున్నాం. అన్ని కోణాల్లో నిరోధించడానికి శ్రమిస్తున్నాం. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇస్తున్నారు.

– లక్ష్మి, ఐసీడీఎస్, సూపర్‌వైజర్, విజయపురం

అందరూ బాధ్యులే



బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకులు, అనుమతించిన పెద్దలు, పెళ్లికి సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. మైనర్ బాలికను పెళ్లి చేసుకుని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది.

– బలరాం, ఎస్ఐ, విజయపురం

13న రైతులకు అండగా వైఎస్ఆర్ సీపీ

- విజయవంతం చేయండి: ఇన్‌చార్జి కృపాలక్ష్మి



కృపాలక్ష్మి

గంగాధరనెల్లూరు: రైతులకు అండగా వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ రిన్‌చార్జి కృపాలక్ష్మీ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోకపోగా, రైతులను అభివృద్ధి చేసే ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని తెలిపారు. రైతులను నిలువునా మోసం చేస్తూ పెట్టుబడి సహాయం కూడా ఇవ్వకుండా, రైతు భరోసా, రైతు బీమా తదతర పథకాలను నీరుగార్చిన విధానంపై పోరాటానికి వైఎస్ఆర్ సీపీ సిద్ధమని కృపాలక్ష్మి అన్నారు . ఈ క్రమంలో పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీ చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు, శ్రీరంగరాజపురం మండలాలకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌కు తరలిరావాలని కోరారు. మిగిలిన వెదురుకుప్పం, కార్వేటి నగరం మండలాలకు చెందిన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తిరుపతి కలెక్టరేట్‌లో జరగనున్న కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

స్త్రీ నిధి మెరుగు పడాలి

పాలసముద్రం: రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి అని ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం కల్పలతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థ మెరుగు పరచాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర, శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కల్పలతరెడ్డి

పన్నూరులో భయాందోళన

విజయపురం: రాత్రి పది దాటితే పన్నూరు సబ్‌స్టేషన్ ప్రజలు భయపడిపోతున్నారు. ఇటీవల పన్నూరు సబ్‌స్టేషన్‌లో కొందరు మద్యం మత్తులో అంగడి పైకప్పు తొలగించి, లోపలికి వెళ్లి, దొంగతనానికి పాల్పడి, ద్విచక్రవాహనాలను తీసుకెళ్లారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి 10గంటల వరకు మద్యం షాపు ఉండడంతో కొందరు అక్కడే మాటు వేసి ఈ ఘాతుకాలకు పాల్పడుతున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. తమిళనాడుకు చెందిన కొందరు ఈ పరిసర ప్రాంతాల్లో రాత్రి పూట గంజాయి విక్రయిస్తున్నారని, మద్యం, గంజాయికి అలవాటు పడిన వారే ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదంటే వారు ఎంతగా భయపడిపోయారో అర్థమవుతోంది. ఇది వరకు పన్నూరు స్టేషన్‌లో రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు పోలీసు గస్తీ ఉండేవారు. అయితే గత నాలుగు నెలలుగా పోలీసు గస్తీ లేకపోవడంతో ఇలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక అర్బన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అదనపులోడ్ ఉండే ప్రాంతాలను గుర్తించి స్టోర్స్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాలని సూచించారు. అవసరమైన చోట్ల కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులను వందశాతం వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. 2022 వర్క్‌ఆర్డర్లను ఈనెల లోపు క్లోజ్‌చేయకపోతే సంబంధిత ఏఈల జీతాల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కొంగారెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ డీఈ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, వాసుదేవరెడ్డి, డీఈలు ఆనంద్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని మైనగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 35 మందికి వైద్య పరీక్షలు చేశారు. సరకల్లులో.. మండలంలోని సరకల్లులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యబృందం పర్యటించారు. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 42 మందికి వైద్య పరీక్షలు చేశారు.

• చెత్తమయం.. వ్యాధుల భయం



పుత్తూరు పట్టణంలోని ధర్మరాజుల స్వామి ఆలయ తోపులో ఏర్పాటు చేసిన చెత్త కుండీ నిండిపోయి, పరిసరాలు మొత్తం దుర్గంధం వెదజల్లుతోంది. సమీపంలోనే పలు కూరగాయల అంగళ్లు నిర్వహిస్తున్నారు. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఇక్కడి అవసరాల దృష్ట్యా ప్రతిరోజూ చెత్తను తొలగించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– పుత్తూరు

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ లతబాలాజీ

కార్వేటినగరం: అందరి సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ లతబాలాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల శాఖ అధికారుల సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీల సమస్యలను రానున్న జనరల్ బాడీ సమావేశం లోపు పరిష్కరించాలని అన్నారు. ఏఓ హేమలత మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశామన్నారు. విద్యాభివృద్ధికి విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల సహకారం అవసరమని ఎంఈఓ విజయ కుమార్ అన్నారు. ఈనెల 7న మెగా పేరెంట్స్ సమావేశం విజయవంతమైందని ఎంఈఓ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ త్యాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సంవత్సరానికి మూడు సిలిండర్లు పంపిణీ చేస్తుందని, రైతుల కోసం భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారంలో తహసీల్దార్ నాగరాజు ముందుంటారన్నారు. కొల్లాగుంట గ్రామంలో ఎరువులు అమ్మాలని ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, పట్నం ప్రభాకర్ రెడ్డి ఏఓకు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా గ్రామంలో తాగునీటి పైపు లైన్లు లీకేజీలు లేకుండా చూడాలని సర్పంచులు కార్యదర్శులను కోరారు. కృష్ణాపురం రిజర్వాయర్‌లో 6 లక్షల చేపలతో పెంపకం చేపట్టడం జరిగిందని మత్స్య శాఖ అధికారి రామచంద్ర అన్నారు. అందరికీ వంద రోజులు పనులు కల్పించడం ఉపాధి కింద జరుగుతుందని ఏపీఓ జాహ్నవి తెలిపారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో గ్రామీణ రోడ్లు మెరుగుపడుతాయని ఎంపీడీఓ టి.చంద్రమౌళి అన్నారు. ముక్కారవాణి పల్లె ఆది ఆంధ్రావాడలో శ్మశానం వర్షం పడితే చెరువును తలపిస్తోందని తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గుణవతి లోకనాథంనాయుడు అధికారులను కోరారు. అదేవిధంగా జండ్లపేట వరకు బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ శేఖర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పశువైద్యాధికారి హేమకుమార్, వైద్యాధికారిణి డాక్టర్ భువనేశ్వరి, ఏఈలు రామమూర్తి దినేష్, ఏపీఎం కవిత, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ సీఐ ఉమామహేశ్వర్ విద్యార్థులకు సూచించారు. చిత్తూరు, మురకంబట్టులోని అపోలో కాలేజీలో మంగళవారం సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసాలకు అమాయకులు బలవుతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన కలిగి ప్రజలకు వివరించాలన్నారు. ఎస్ఐ నాగసౌజన్య మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో పోలీసు శాఖ ముందుండి పనిచేస్తోందన్నారు. మహిళలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. అధ్యాపకులు హసీనా, కల్యాణి, యోగిని పాల్గొన్నారు.

పిండ మార్పిడి విజయవంతం

కాణిపాకం: పూతలపట్టు మండలం పి.కొత్తకోటలో మంగళవారం పశువుల్లో పిండ మార్పిడి పద్ధతిని విజయవంతంగా నిర్వహించారు. పశువైద్యాధికారి శివనాగరాజు మూడు నెలల క్రితం జెర్సీ, గిర్ ఆవు పిండం మార్పిడి చేయగా విజయవంతమైంది. ఈ పద్ధతని పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ పరిశీలించారు. అనంతరం ఆవులకు పోషక పదార్థాలు అందజేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నేతలు నిరసన తెలిపారు. మంగళవారం నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదానీకి మోదీ, చంద్రబాబు తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు. మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. నేతలు మణి, రమాదేవి, దామోదరం, మహేష్ పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవితకే కిశోరి వికాసం



మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప

పాలసముద్రం: యుక్త వయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి, ఐసీడీసీఎస్ సూపర్‌వైజర్ అనురాధ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అధికారులకు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్‌కు కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, కిశోరి వికాసం కార్యక్రమంపై వివరించారు. విచ్చేసిన ఎస్ఐ చిన్నరెడ్డెప్ప మాట్లాడుతూ యుక్తవయస్సులో బాలబాలికలలో శారీరకంగా వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలియజేశారు. సెల్ ఫోన్లలో మెసేజ్‌లు, ఇతర మార్గాల ద్వారా సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దని సూచించారు. ఎక్కువ వడ్డీలు వసూలు చేయడంలో లోన్ యాప్ నిర్వాహకులు క్రూరంగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గిరిజ, వైద్యాధికారి ప్రవీణ్, సీహెచ్ఓ జ్ఞానశేఖర్, రూరల్ సంస్థ సభ్యుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



మాట్లాడుతున్న డీఏఓ మురళీకృష్ణ

ఐరాల: రబీ సీజన్‌లో ఉత్తమ యాజమాన్య పద్ధతులతోనే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని 35 యర్లంపల్లెలో స్థానిక సర్పంచ్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. వరి, వేరుశనగ పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు ఈనెల 31లోపు, వేరుశనగ పంటకు 15వ తేదీలోపు బీమా చెల్లించాలన్నారు. వ్యవసాయంలో పాటించాల్సిన మేలైన పద్ధతులు రైతులకు తెలిసేలా అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. ఏడీఏ ఉమ, పశుసంవర్థక శాఖ ఏడీఏ పద్మావతి, ఏఈఓలు ద్రాక్షాయని, ఆనంద్, సెరికల్చర్ అసిస్టెంట్ గణేష్, ఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ హనుమంతు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గర్భిణుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వద్దని, మాతా శిశు మరణాల కట్టడికి విధిగా పనిచేయాలని డీఐఓ హనుమంతరావు, గైనిక్ వైద్యులు ఉషశ్రీ సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం మాతాశిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. మరణాలకు గల కారణాలపై డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ శిశు మరణాలపై గర్భిణులకు, కుటుంబీకులకు అవగాహన కల్పించి నివారణకు కృషిచేయాలని పేర్కొన్నారు. వైద్యులు లత, జానకీరావ్ పాల్గొన్నారు.

